విశాలాంధ్ర కృష్ణా జిల్లా

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు : మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-గుడివాడ : సచివాలయం సిబ్బంది సమయపాలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం స్థానిక 8, 10, 11వ వార్డుల సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల రికార్డులు, పర్సనల్ రిజిస్టర్, సెలవు రిజిస్టర్లు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనతరం అయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణపై సచివాలయ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా సచివాలయ ఉద్యోగులు పాటించాలన్నారు. రికార్డుల నిర్వహణలో సమయపాలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చారించారు. స్పందన, జగనన్నకి చెబుదాం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు.

పార్టీలకతీతంగా రైతులంతా ఏకమవ్వాలి

జిల్లా మహాసభలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-చల్లపల్లి : పార్టీలకతీతంగా రైతులంతా ఏకమై రైతుసంఘాలను బలోపేతం చేసి రైతాంగ ఉద్యమానికి సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కృష్ణా జిల్లా మహాసభ చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలోని కొల్లి బుచ్చికోటేశ్వరరావు సభా ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్య మాట్లాడుతూ, నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు, 370 ఆర్టికల్ రద్దు, కార్మికచట్టాల రద్దు, ప్రభుత్వ సంస్థల ప్రవేటీకరణ ఇలా నరేంద్ర మోదీ అవలంభిస్తున్న విధానాలు, తీసుకువచ్చిన చట్టాలకు వ్యతిరేఖంగా ఎన్ని పోరాటాలు జరిగినా చలించని ప్రధాని రైతుచట్టాలకు వ్యతిరేఖంగా ఉవ్వెత్తున జరిగిన ఆందోళనకు దిగిరాక తప్పలేదనీ, ఏడాదిపాటు ఢిల్లీలో జరిగిన రైతుఉద్యమం రైతుల విజయం అన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ,

దేశంలో అనేక ప్రభుత్వాలు రైతుసమస్యల పరిష్కారం కోసం 65 కమీషన్లు వేసి ఆ కమీషన్ రిపోర్టులను అమలుచేయకుండా బుట్టదాఖలు చేశాయనీ, కమీషన్ సిఫార్సులు అమలుచేస్తే రైతులకు పోరాడాల్సిన అవసరం రాదన్నారు. రైతుసంఘాలను పటిష్టం చేసుకుని ఆందోళనలు ఉధృతం చేయాలనీ, రైతు ఉద్యమం ద్వారా రైతాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్యను రైతు నాయకులు సన్మానించారు. రైతుసంఘం జిల్లా నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, డొక్కు శ్రీనివాసరావు, ముక్కామల ఉమామహేశ్వరరావు, వేమూరి రత్నగిరిరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభలో రైతుసంఘం రాష్ట్ర నేతలు వెలగపూడి ఆజాద్, పి.జమలయ్య, సీపీఐ ఇన్చార్జి కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చియ్య, మల్లు పెద్ది రత్నకుమారి, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరుచూరి రాఘవేంద్రరావు, వాకా రామచంద్రరావు, పరుచూరి శ్రీనివాసరావులు ప్రసంగించారు. రైతుసంఘం నేతలు గుత్తికొండ రామారావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు, రైతుసంఘం నేతలు, రైతులు పాల్గొన్నారు. తొలుత రైతుసంఘం పతాకాన్ని సీనియర్ నేత పరుచూరి శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

అవనిగడ్డలో భారీ వర్షం

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ లో రెండు గంటల పాటు వర్షం ముంచెత్తింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా, ప్రధాన రహదారి సయితం తటకాన్ని తలపించేలా మారాయి. బుధవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు రెండు గంటల పాటు కుంభ వృష్టి కురవడంతో లోతట్టు ప్రాంతాలయిన సింహాద్రి కాలనీ, మండలీపురం, బి.సి కాలనీ, రెండవ వార్డు లోని ఎస్.టి కాలనీ లంకమ్మమాన్యం రాజశేఖరపురం, 8,9 వార్డులతో పాటు వీవర్స్ కాలనీ, ఎస్.టి. కాలనీలలో గృహాలు సయితం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభమయ్యే సమయంలో వర్షం రావడంతో కార్యాలయాలకు వచ్చే అధికారులు తీవ్ర అసహనానికి గురైయ్యారు. ఈ నెల 6వ తేది నుండి బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడనున్నట్లు ముందస్తుగానే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో 1990 మే 9 వ తేదిన వచ్చిన తుఫాన్ గుర్తుచేసుకుని దివిసీమ వాసులు మరింత భయాందోళనలో ఉన్నారు.

జలమయమైతున్న రహదారులు

విశాలాంధ్ర-కూచిపూడి : వేసవికాలంలో కురుస్తున్న అకాల వర్షాలు తొలకరిని తలపింపచేస్తున్నాయి. మొవ్వ మండలంలో ని గోతులతో గల ప్రధాన రహదారులన్నీ వర్షపునీడితో నిండి ప్రమాదకరంగా మారటమే కాకుండా చెరువులను తలపింపచేస్తున్నాయి. కూచిపూడి సెంటర్నుండి వార్లపూడి రోడ్ లో చెరువు మలుపువరకు గల ఆర్ అండ్ బి రోడ్డుపై నీరు నిలిచి రామాలయం దగ్గర, నాట్య కళాపీఠం వద్ద, హై స్కూల్ సమీపంలో రోడ్డుపై నీరు పారుతోంది. ఈ గోతుల బాధలు ఇంకా ఎంతకాలం అనుభవించాలానిపాద చారులు, వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు.

డీఎఫ్‌సీఎస్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : డి.ఎఫ్.సి.ఎస్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలని డి.ఎఫ్.సి.ఎస్ మాజీ ఉపాధ్యక్షులు లకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ప్రాంతీయ మత్సశాఖ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మార్చ్ నెలలో నిర్వహించవలసిన మత్ససహకార సంఘ సర్వసభ్య సమావేశం మే నెల వచ్చినప్పటికి నిర్వహించకపోవడం మత్సశాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. జిల్లాలో మత్సకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డి.ఎఫ్.సి.ఎస్ జనరల్ బాడీ సమావేశంలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాస్సిన అవసరం ఉన్న దృష్ట్య తక్షణం డి.ఎఫ్.సి.ఎస్. జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని లకనం డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెటింగ్ సహకార సంఘ అధ్యక్షులు కర్రి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తొలగింపు

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ ఏడాది అక్టోబర్ నాటికి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తవుతాయని ఏపీ మ్యారీ టైం పేజ్ -1 ఫిషింగ్ హార్బర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. మునిరెడ్డి తెలిపారు. బుధవారం మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ బీ.వి. కె. డీ నాగలక్ష్మి భవాని విఠల్ స్థానిక గిలకలదిండిలో రూ.348 కోట్లతో ఫిషింగ్ హార్బర్ వద్ద జరుగుతున్న పనులను స్వయంగా ముడా కార్యాలయం సిబ్బంది, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ డిప్యూటీ మేయర్ పలువురు కార్పొరేటర్లతో కలిసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులను పరిశీలించేందుకు స్వయంగా వెళ్లారు. ఏపీ మ్యారీ టైం పేజ్ -1 ఫిషింగ్ హార్బర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. మునిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, మచిలీపట్నం గిలకలదిండిలో సముద్రపు మొగ నుండి 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను డ్రెడ్జర్ల సహాయంతో 70 శాతం తవ్వకం పనులు దాదాపుగా పూర్తయినట్లు వివరించారు. అనంతరం, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ బీ.వి. కె. డీ నాగలక్ష్మి భవాని విఠల్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవితా థామస్ నోబుల్, తదితరులు మాట్లాడుతూ, మచిలీపట్నంలో సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మచిలీపట్నం పరిసర ప్రాంతాల మత్స్యకారుల చిరకాల స్వప్నం మరికొద్ది నెలల్లో ఆవిష్కృతమవుతుందన్నారు, దాదాపు 2009 సంవత్సరం నుండి సముద్రము మొగలో పూడిక తీయించాలని డిమాండ్ ఈ ప్రాంతంలో ఉందన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, కేవలం మచిలీపట్నం లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 చోట్ల ఆధునిక వసతులతో కూడిన ఫిషింగ్ హార్బర్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. హార్బర్ పనుల పరిశీల నకు మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సిబ్బంది సముద్ర తీరాన నిర్మిస్తున్న హార్బర్ పనులను మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ కె. రాజ్యలక్ష్మి, కార్పొరేటర్లతో పరిశీలించారు. 2 మరపడవల్లో సముద్ర మొగ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భనలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్ పర్సన్ కె. రాజ్యలక్ష్మి , సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్ డి ఎస్ ప్రసాద్,స్థానిక కార్పొరేటర్ తిరుమల శెట్టి వరప్రసాద్ పాల్గొన్నారు.

పాగోలులో రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర-చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలు గ్రామంలో శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం రెండవ విడతలో రీ సర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్క కె.గోపాలకృష్ణ తెలిపారు. రీసర్వేకు సంబంధించి ఓఆర్ ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్) వచ్చాయనీ, వాటి ప్రామాణికంగా భూమి ధృవీకరణ చేసిన అనంతరం డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తయారుచేస్తామన్నారు. రైతులు వారి భూమికి సంబంధించిన హక్కు పత్రాలు, పాసుపుస్తకాలతో సర్వే సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో మూడు బృందాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-కూచిపూడి : పాలంకిపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటితో పాటు సర్వస్వం కోల్పోయిన ఇస్మాయిల్ కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మువ్వ మండల శాఖ బుధవారం తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ ఇచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీతరఫున వంట సామాగ్రి, స్టీల్ సామాగ్రి, బకెట్, హైజినిక్ కిట్స్, కాస్మెటిక్స్, దోమతెర, దుస్తులు అందించారు. అలాగే రెవెన్యూ తరఫున బియ్యం, పంచదార, కందిపప్పు నిత్యవసరాలు, ఎనాబిక్ కంగన్వాటర్(జపాన్) తరఫున ఆర్థిక సహాయం రూ.2వేలు, గ్రామ సర్పంచ్ తరఫున ఈడే రామకృష్ణ రూ.3 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ ఎంసీ మెంబర్, మువ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరావు, సభ్యులు కోనేరు రాజేంద్రప్రసాద్, గొర్రివర్తి వెంకటరమణ, మద్దాల కామేశ్వరరావు, దోనేపూడి శివరామయ్య, జొన్నలగడ్డ హనుమకుమార్, విఆర్ఓ కె శ్రీనివాసరావు, గ్రామస్తులు మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు ,ఈడే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను వదలని వర్షం

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మండలంలోని మామిడి రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాడికాయపడిన చందంగా తయారైంది. ఇప్పటికే వర్షాలతో విలవిలలా డుతున్న మామిడి రైతాంగానికి బుధవారం మరలా వర్షం పడటంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ధరలు లేక కోత కూలీలు ఖర్చులు కూడా రాకపోయే పరిస్థితి ఉండటంతో మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. తరచూ వర్షాలు మామిడి రైతాంగానికి తీరని నష్టాన్ని మిగిల్చాయి. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మామిడి రైతాంగానికి నష్టపరిహారంవచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండలంలోని మామిడి రైతాంగం ముక్తకంఠంతో కోరుతున్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వికలాంగుల పింఛన్ ధరలకు అనుగుణంగా రూ. 6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్నా సుబ్బయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ లో ఉమ్మడి కృష్ణ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిధిగా విచ్చేసిన సుబ్బయ్య మాట్లాడుతూ శారీరక వికలాంగులకు రోస్టర్ పాయింటు టాప్-10లో పెట్టాలన్నారు. మందకృష్ణ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీన ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేస్తున్నామన్నారు. అనంతరం ఎన్.టి.ఆర్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గబ్బిట్ లక్ష్మీనారాయణ శాస్త్రి,కో-కన్వీనర్స్ జి.సతీష్,వివి రమణ,ఉపాధ్యక్షురాలు కే. సామ్రాజ్యం,కార్యదర్శి ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షుడు మొండితోక విజయ్ కుమార్,ఉన్నారు.అలాగే కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎమ్.మహమ్మద్ ఆలి అబ్బా, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇబ్రహీం,జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎన్. రజిని, ఉన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గంటేడి సుజాత నాయుడు,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా,లింగాల నరసింహులు,గాలి ముట్టి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సెస్ ఎలక్షన్‌కు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసి రెండు నెలలు గడుస్తున్నా స్పెషల్ ఆఫీసర్‌ని అపాయింట్ చేసి ఎలక్షన్ డేట్ డిక్లేర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి మంజుల దేవి కోరారు. ఈ సందర్భంగా విజయవాడ కమిషనర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం పరిషత్ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్ ఐఏఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. అనతరం ఆమె మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్రంలో పలుచోట్ల జి.జి.హెచ్ల్ నర్సులకు 4 నెలలుగా జీతాలు లేవని, పాత ఏ.పీ.వి. వి.పి లలో పనిచేస్తున్న నర్సులకి రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఏపీ వివిపి లలో నర్సింగ్ సిబ్బంది 2017లో బదిలీలు చేశారని, ఇప్పుడు కూడా సాధారణ బదిలీలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సెస్ రోజ్ కుమారి, అరుణ, స్టాఫ్ నర్స్ సుమన, రమణ, స్వర్ణలత, సుధారాణీ, నాగమల్లేశ్వరి, వెంకటేశ్వరమ్మ, జయప్రద, విక్టరియమ్మలు పాల్గొన్నారు.

సాంకేతికతతో ప్రజలకు చేరువకావాలి : కాగిత

విశాలాంధ్ర-పెడన: సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు చేరువ కావాలని పెడన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో గూడూరు, పెడన, మండల, పెడన పట్టణ పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడి ఎన్నికలలో విజయం సాధించడానికి ప్రయత్నిస్తుందని, వాటిని తిప్పికొట్టి అప్రమత్తతతో ఉండాలని అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుమాట్లాడుతూ బూత్ కన్వీనర్లు, యూనిట్ క్లస్టర్ ఇన్చార్జిలు పార్టీ సూచించిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించాలంటే మీ యొక్కపాత్రకీలకమని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఈ వాటర్ వెరిఫికేషన్ హౌసింగ్ మ్యాపింగ్ పూర్తిగా తనపూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకు సాధనాల ఏడు కొండలు మాట్లాడుతూ వైసీపీ అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్య పరచాలని దానికి ఇదేమి కర్మ మన రాష్ట్రానికి ఒక చక్కని వేదికదన్నారు. అలాగేనియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జీలు క్లస్టర్ల పాత్రప్రముఖమైనదని అన్నారు. గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు నూతన స్వామి, పెడన మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు ఉప్పలపాటి ప్రవీణ్ ఆర్టీఎస్ శిక్షకుడు నితీష్ చంద్ర బూత్ కన్వీనర్లకు, యూనిట్ ఇన్చార్జి లకు, క్లస్టర్లకు ఓటర్ వెరిఫికేషన్ హౌస్ మ్యాపింగ్,ఆర్ టి ఎస్ లపై శిక్షణ ఇచ్చారు.

సోషల్ సర్వీసెస్ సొసైటీ అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : అన్నార్తుల ఆకలి తీర్చడం లో ఎంతో సంతృప్తి వుంటుందని డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ అన్నారు. బుధవారం అంగిరెకుల నాగమణి జ్ఞాపకార్థం శ్రీ అంగిరికుల ఆంజనేయులు మాతృ దేవో భవ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దాత శ్రీ అంగి రేకుల ఆంజనేయులు దాతృత్వం,వారి సహృదయానికి సొసైటీ కార్యదర్శి కొండాయ గుంట రాము ధన్యవాదములు తెలిపారు.ప్రజలు సేవా కార్యక్రమాలు లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ అన్నదాన కార్యక్రమం లో డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, కార్యదర్శి కొండా య గుంట రాము,కోశాధికారి గుర్రం ఏడు కొండలు,ఫణి,నూతన్ ప్రసాద్ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు పైడి పాటి వెంకన్న,సిహెచ్ కోటేశ్వర రావు,చంద్ర మోహన్,మాతృ దేవో భవ సంస్థ నిర్వాహకులు పొట్లూరి దుర్గా, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'వికాస్ రేయిన్‌బో'లో గ్రాడ్యుయేషన్‌డే

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక సత్యనారాయణ పురంలోని వికాస్ రేయిన్‌బొ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం ఎల్‌కెజీ- యుకెజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సెలబర్సెన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డా॥ బందారు శ్యామ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ చిన్నతనంలోనే పెద్దల పట్ల గౌర్వం ఉన్న విద్యార్థులు ఎదిగే కొంది ఉన్నత విద్యాను అభిసించడం జరుగుతుందన్నారు. గత 30 సం॥లుగా ఎంతో మంది విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాను అదించిన పి.రామచంద్రశేఖర్ దగ్గర చదువుకున్న విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉద్యోగులుగా, టెక్నలజీలో ఉద్యోగలతో ఉన్నవారు ఎక్కువగా ఉన్నరన్నారు. నేడు 200 మందికి సిర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించడం అనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాధ బాలికలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-తిరువూరు: పేదరికంలో మగ్గుతున్న ఇరువురు అనాధ బాలికలకు దాత వితరణతో బుధవారం ఆర్థిక సాయం అందించారు. తల్లిదండ్రులు లేని ఇద్దరు బాలికలు పడుతున్న దుస్థితిని చూసి చలించిన తిరువూరు పరిపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సిరికొండ అభి నాగేశ్వరరావు స్థానిక రాజస్థాన్ టీ హెూటల్ ఎదురుగా ఉన్న అయ్యప్ప మెడికల్స్ నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. షాప్ నిర్వాహకుడు మోదుగుల రవిచంద్రారెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి, తన కుమారుడు, కుమార్తెల చేతుల మీదుగా బాలికలు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు, 5 జతల బట్టలు, చెప్పులు వితరణ చేశారు. మెడికల్ షాప్ నిర్వాహకుల ఉదారతను సిరికొండ అభి తదితరులు అభినందించారు.

ఉచిత సంగీత కార్యక్రమాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఉచిత సంగీత కార్యక్రమాలకు ఆస్థాన మండపాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ స్వామి వారి బ్రహోత్సవాలలో భాగంగా ఆలయ వంశ పార్యంపర ధర్మకర్తలు రూ.30 లక్షలతో ఆలయ ఆవరణలో నిర్మించిన ఆస్థాన మండపాన్ని బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ మండపాన్ని ఉచిత సంగీత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని శిక్షకులుగా పాలపర్తి ఆంజనేయులు వ్యవహరిస్తారన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి సీతారామయ్య, ఆలయ ధర్మకర్త పూతరాజు భాస్కరరావు, పూతరాజు వంశీయులు, అర్చక స్వాములు, వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అభివృద్ధి బాటలో మహేశ్వరపురం పంచాయతీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మహేశ్వరపురం గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు డ్రైనేజీ సమస్యను పరిష్కరించటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆ గ్రామ సర్పంచ్ జువ్వనపుడి రాజును పలువురు అభినందిస్తున్నారు. పంచాయతీ నిధులతో జెసిబి ద్వారా రోడ్ల వెంబడి సైడ్ కాలువలను తవ్విస్తున్నట్లు రాజు తెలిపారు. వివరాల్లోకెళ్తే ఇంతకుముందు సర్పంచిగా చేసిన కలుగురి వెంకటేశ్వర్లు నీటి, త్రాగునీటి సమస్యను పరిష్కరించడంలో సాధ్యమైనంత వరకు ఇంటింటికి టాప్ కనెక్షన్ ఇవ్వటంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. అలాగే అంతకుముందు సర్పంచిగా చేసిన కొల్లారెడ్డి వెంకటనారాయణ రెడ్డి గ్రామ విద్యుత్ సమస్య పరిష్కరిస్తూ ఎన్ని స్తంభాలు అయితే ఉన్నాయో వాటన్నిటికీ ట్యూబ్ లైట్ ఫిట్టింగ్ చేయించిన ఘనత ఆ రోజున ఆ సర్పంచ్ కే దక్కిందని గ్రామస్తులు కొనియాడుస్తున్నారు. పనిచేసే నాయకులను పార్టీలకతీతంగా ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని ఆ గ్రామస్తులు ఆయా సర్పంచ్లను అభినందిస్తున్నారు.

పింఛన్ దారులు 10లోగా ఈకేవైసీ నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ఉపఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్ పొందుతున్న పింఛన్‌దారులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 10వ తేదిలోగా ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎంహెచ్.రహమాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఆధార్‌తో అనుసందానమైన ఫోన్ నెంబర్, ప్రస్తుత నివాస చిరునామాను విధిగా నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌తో అనుసందానమైన ఫోన్ నెంబర్ లేనివారు ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఫోన్ నెంబర్‌ను ఆధార్ అప్‌డేట్ చేసుకున్న తరువాత జిల్లాలోని ఉపఖజానా కార్యాలయాలకు వెళ్ళి ఇకేవైసీ చేయింకోవాలన్నారు. తద్వారా విశ్రాంతి ఉద్యోగికి సాంకేతికతో కూడిన ఆర్థిక భద్రత కల్పించబడుతుందన్నారు. ఈకేవైసీ పూర్తి అయితే పింఛన్ దారులు తమ పెన్షన్ వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోనేందుకు వీలు కలుగుతుందని, పింఛన్‌దారుల సౌలభ్యం కోసం ప్రతి పెన్షన్‌దారుడు గడువులోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

పీహెచ్‌సీ నిధులపై సమగ్ర విచారణ చేయాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల : మండల కేంద్రము వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదాయం వ్యయాల నిధులపై రికార్డులు సరిగా లేవని దీనిపై జిల్లా స్థాయి అధికారి పరిశీలించాలని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు.బుధవారం వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే విలేకరులతో మాట్లాడుతూ వైద్యశాల నిధులు ఆదాయ వ్యయాలు పై సమగ్రమైన సమాచారం లేదని అసంపూర్తిగా వుందన్నారు.ఈ విషయంపై తాము పరిశీలించే కంటే జిల్లా వైద్యాధికారి పరిశీల నిమిత్తం తగు చర్యలు తీసుకునేలా సమావేశం తీర్మానించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యంపిపి కాసాని వేద సుప్రజా యంపిడిఓ సుధా ప్రవీణ్ లంకపల్లి సర్పంచ్ వి.రత్న కుమారి పాల్గొన్నారు.

మైలవరం ఎస్ఐగా హరిప్రసాద్

విశాలాంధ్ర-మైలవరం : మైలవరం ఎస్ఐగా ఎస్ హరిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు, సాధారణ బదిలీలలో భాగంగా పెనుగంచిప్రోలు ఎస్ఐగా పనిచేసి మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గాంధీహిల్‌ను పర్యాటక ప్రదేశంగా చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని గాంధీహిల్‌ను పర్యాటక ప్రదేశంగా రూపొందించాలని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మేయర్, కమిషనర్ బుధువారం గాంధీహిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలు ఈ వేసవి కాలంలో సాయంత్రం వేళల్లో గాంధీహిల్‌కు వచ్చే విధంగా ప్రణాళికలను సిద్దాం చేయాలనీ అధికారులకు ఆదేశించారు. గాంధీహిల్‌కు చిన్నారుల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి ఆహ్లాదాన్ని అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గాంధీహిల్‌లో ఆకర్షణీయంగా ఉండేలా ఏర్పాటు చేయనున్న కళాకృతులను మరింత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. హిల్ కాంపౌండ్‌వాల్, కొండపైకి వెళ్లే దారిలోని గోడకు తగిన మరమ్మతులు నిర్వహించటంతో పాటు మెట్లు మార్గానికి ఇరువైపులా చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ చేయాలన్నారు. బాగా పెరిగిన చెట్లు గుబురు తొలగించి పరిసరాలన్నీ పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అబ్దుల్ ఆకీమ్ అర్షద్, డీసీపీ జుబిన్ శిరన్‌రాయ్, ఈఈలు నారాయణమూర్తి, ఏఎస్ఎన్.ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించిన కమిషనర్

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్మాణలో ఉన్న నూతన భవన నిర్మాణాన్ని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. బుధువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం స్థితిగతులు, అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు మొదలగు వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆగస్టులో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ రెండు కుడా ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ప్రభుత్వానికే అవమానకరం

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి చెందిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా, విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికులు చేస్తున్న దీర్ఘకాల పోరాటానికి మద్దతుగా కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు వామపక్ష పార్టీలు, ఇతర రాజకీయ పార్టీల సంఘీభావంతో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రాస్తారోకో ఉద్యమాన్ని భగ్నం చేసేందుకు అక్రమ అరెస్టులు చేయించటం రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరమని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు ఒక ప్రకటనలోతీవ్రంగా విమర్శించారు. 2వ తేది రాత్రి నుంచే జిల్లా వ్యాప్తంగా సీపీఐ, కార్మిక సంఘాలకుచెందిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులకు నోటీసులు ఇవ్వటం, గృహ నిర్బంధంలో ఉంచటం, అత్యంత దారుణమని పేర్కొన్నారు. 3వ తేది ఉదయం కూడా విజయవాడ నగరం, తిరువూరు, మైలవరం, నందిగామ, నియోజకవర్గాలలో అక్రమ అరెస్టులను కొనసాగించటం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ఈ ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చి రాష్ట్ర ప్రయోజనాలన్ని కాపాడవలసిన రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టు చేయించటం ప్రజలలో అసంతృప్తికి గురికావటమేనని కోటేశ్వరరావు పేర్కొన్నారు.

నేడు గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని, వంటగ్యాస్ సిలిండర్ రూ. 500/-లకే ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపు అనగా ది.04.05.2023 గురువారం ఉదయం 11:00 గంటలకు వినూత్న నిరసన కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద జరుగుతుందని పేర్కొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

విశాఖ ఉక్కు ఉద్యమం సాధించి తీరుతాం

-ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-విజయవాడ : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్రబడుతున్నదని దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఎనిమిది వందల రోజుల పైన ఉద్యమం సాగిస్తా ఉంటే వారి గోడును ఎవరు పట్టించుకోవడంలేదని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య అన్నారు. బుధవారం చలసాని నగర్ రోడ్డు హైవే పై ముఠా కార్మికులతో కలిసి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ప్రైవేటీకరణ ఆపాలంటూ వెంకటసుబ్బయ్య నినాదాలు ఇచ్చారు. వెంటనే పోలీసులు ఆయనను కట్టడి చేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ . రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు కేంద్ర కార్మిక సంఘాలు అన్ని రోడ్డుపైకి వచ్చి తమ నిరసన గళాలను వినిపిస్తా మని కార్యక్రమం తీసుకుంటే ఈ కార్యక్రమాన్ని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు పురమాయించి అణిచివేయడం చాలా దుర్మార్గం అన్నారు. ఇది బీజేపీకి సపోర్ట్ చేయడమేనన్నారు. అంతలో ఈ కార్యక్రమంలో ఆర్టిసి కూలీల యూనియన్ ప్రధాన కార్యదర్శి వేముల రాంబాబు, హైవే ముఠా యూనియన్ నేను మేస్త్రి వేముల శీను ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నిరుద్యోగ యువతను మోసం చేసిన మోదీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపాలని యువతకు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ : అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవాడ నగరంలో దాసరి భవన్ వద్ద ఏఐవైఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో నగర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షులు కాళ్ళ విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఏఐవైఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు ఆవిష్కరించారు. అనంతరం గోవిందరాజులు మాట్లాడుతూ దేశంలో జనాభా కంటే నిరుద్యోగ సమస్య రోజు రోజుకు ఘణనీయంగా పెరుగుతుందన్నారు. పాలకుల స్వార్థప్రయోజానాలకోసం యువ~ను పక్కదారిపట్టిస్తూ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముతున్నారని తెలిపారు. ఇవి చాలక విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటు పరం చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నోరు మెదపక పోవడం సిగ్గుచేటు అన్నారు .ముఖ్యంగా వైసీపీ తమ కార్యకర్తలుకు కార్పొరేషన్ తదితర నామినేటెడ్ పదవుల ద్వారా పదవులు ఇచ్చి రాజకీయ నిరుద్యోగ సమస్య తీర్చిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాల తీరు మారకపోతే రాబోయే ఎన్నికల్లో పాలకులకు నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి ఆలీ స్వాగతం పలుకగా నగర ఉపాధ్యక్షులు లంకే సాయి వందన సమర్పణ చేశారు.

మౌలిక వసతుల కల్పనకై రాజీలేని పోరాటం

విశాలాంధ్ర-నందిగామ : ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సీఆర్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు జిల్లేపల్లి తుఫాన్‌బాబు జండా ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మన్నే హనుమంతరావు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి మౌలిక వసతులు కల్పనకై ఏఐవైఎఫ్ రాజీలేకుండా ఎప్పటి కప్పుడు పోరాటం చేస్తూ ఉన్నదని ఆయన తెలిపారు. 1959వ సంవత్సరం మే నెల 3వ తేదీన ఏఐవైఎఫ్ సంఘంగా నిలబడి భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, చేగువేరా స్ఫూర్తితో నేటికీ 63 సంవత్సరాలు పూర్తి చేసుకుని 64వ సంవత్సరంలోనికి అడుగుపెట్టిందని అన్నారు. మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం రూపొందించి అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకై ప్రతిఒక్కరూ పోరాడాలని అన్నాడు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, ఏఐవైఎఫ్ పట్టణ కార్య దర్శి నాగరాజు, షేక్ జానీ, షాహిల్ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యులు వలంకొండ శేషగిరిరావు మృతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ సభ్యుడు వలంకొండ శేషగిరిరావు (68) బుధవారం ఉదయం 5 గంటలకు గుండెనొప్పితో ఆయన స్వగృహంలోనే మృతి చెందారు. ఈయన 42 సంవత్సరాల నుండి భారతకమ్యూనిస్ట్ పార్టీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసు కున్న సీపీఐ సీనియర్ నాయకులు పాటిబండ్ల లక్ష్మయ్య, వలంకొండ బ్రాహ్మం, సీపీఐ గ్రామ కార్యదర్శి గద్దం శ్రీనివాసరరావులు శేషగిరిరావు మృతదేహంపై ఎర్రజెండాను కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేషగిరిరావు ఎంతో క్రమశిక్షణ గల వ్యక్తిగా ఆయన బతికినంత కాలం కమ్యూనిస్టుగానే జీవించారని, ఆయన లేని లోటు కమ్యూనిస్టుపార్టీకి తీరనిదని అన్నారు. శేషగిరిరావు మృతదేహాన్ని సీపీఐ నాయకులు మాజీ ఎంపీపీ పొన్నం నరసింహారావు, సీపీఐ మండల కార్యదర్శి కనకపూడి బాబురావు. సహాయ కార్యదర్శి వలంకొండ. భాస్కరరావు, చల్లాల శివాజి (సిద్ధాంతి) గద్దం నాగేశ్వరరావు, జిల్లేపల్లి జిన్నా, జక్కులూరి వెంకటేశ్వర్లు, వేల్పుల కాంతయ్య, గరిడి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ అత్తులూరి అచ్చుతరావు తోట్టెంపూడి మురళి, భద్రయ్య, కర్నాటి వెంకటరమణ, గుమ్మడిదుర్రు సొసైటీ మాజీ అధ్యక్షులు యార్లగడ్డ విశ్వనాదం, పొన్నం బాలాజీ, వైసీపీ నాయకులు పొన్నం ప్రసాద్, అనిగండ్లపాడు సర్పంచ్ బోశెట్టి జ్యోతి బ్రాహ్మం, సొసైటీ అధ్యక్షులు పిడికిడి కోటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు నెల్లూరి గోపాలరావు, మాజీ అధ్యక్షులు కందిమళ్ళ. వెంకటరమణ, గ్రామ వైసీపీ అధ్యక్షులు గంగూరి ప్రసాద్, ఎస్సీసెల్ నాయకులు కనకపూడి భాస్కరరావు, దోసపాటి దానయ్య, సీపీఎం నాయకులు వలపుదాసు గురవయ్య, ఎర్రబోలు రామారావు తదితరులు మృత దేహాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. శేషగిరిరావు సోదరులు సీపీఐ సీనియర్ నాయకులు వలంకొండ బ్రాహ్మం మాట్లాడుతూ గురువారం ఉదయం అంతిమ యాత్ర ఉంటుందని, కార్యకర్తలు సానుభూతి పరులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ నాయకుల గృహనిర్బంధాలు

విజయవాడ నగరంలో గృహ నిర్బంధంలో దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, లంకా దుర్గారావు, కోట్టు రమణ, దుర్గాశి రమణమ్మ, ఓర్సు భారతి

విశాలాంధ్ర-విజయవాడ : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో పిలుపులో భాగంగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు, ఇతర వామపక్షాల నాయకులను, పోలీసుల అక్రమ హౌస్ అరెస్టులు చేశారు. నాయకుల అక్రమ అరెస్టులను సీపీఐ విజయవాడ నగర సమితి తీవ్రంగా ఖండించింది.

నాయకులు గృహ నిర్బంధాలకు సీపీఐ ఖండన

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో పిలుపులో భాగంగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు, మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, కార్యవర్గ సభ్యులు దుర్గాసీ రమణమ్మ, ఇతర వామపక్షాల నాయకులను, పోలీసుల అక్రమ హౌస్ అరెస్టులు చేశారు. నాయకుల అక్రమ అరెస్టులను సీపీఐ విజయవాడ నగర సమితి తీవ్రంగా ఖండించింది.

అక్రమ అరెస్టులు ఖండన

విశాలాంధ్ర-ఎ కొండూరు : పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాలు, రైతు సంఘాలు వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ బుధవారం రాస్తారోకోకి సిద్ధమైతే రాత్రికి రాత్రే పోలీసులు సీపీఐ నాయకులకు నోటీసులు ఇచ్చి గృహనిర్బంధం చేశారని అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నాకు 25 పార్లమెంట్ స్థానాలలో గెలిపించితే కేంద్రంలోని నరేంద్రమోదీ మెడలువంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు సాధిస్తానని అలాగే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం కాకుండా కాపాడుతానని ప్రగల్భాలు పలికి నేడు నోరుమెదపకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మోసంచేసిన జగన్‌ను అలాగే నరేంద్రమోడీని సాగనంపి కార్మిక చట్టాలను విశాఖ పరిశ్రమను కాపాడుకోవాలని ఇటువంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని డేవిడ్ కోరారు.

వీరులపాడు సీపీఐ నాయకుల ముందస్తు అరెస్టులు

విశాలాంధ్ర-వీరులపాడు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా వామపక్ష పార్టీలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో కార్యక్రమాలు తలపెట్టిన సందర్భంగా మండల కేంద్రం వీరులపాడులో సీపీఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వట్టి కొండ చంద్రమోహన్ మాట్లాడుతూ జి.ఓ నంబర్ 1 ని అడ్డం పెట్టుకొని శాంతియుతంగా నిరసన తెలియచేస్తుంటే ముందస్తు అరెస్ట్ చేయటం దుర్మార్గపు చర్య అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని దుయ్య బట్టారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లుగా ఉందని ఆయన అన్నారు.ఆంధ్రుల పోరాట పటిమకు,ఆత్మగౌరవానికి సజీవ సాక్ష్యమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానేయకుండా పూర్తిస్థాయి సామర్థ్యంతో ప్లాంట్ కొనసాగేలా పోరాటం చేయాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్క ఆంధ్రుడు పైన ఉందని, స్టీల్ ప్లాంట్ అన్యాక్రాంతం కాకుండా ఏ త్యాగానికైనా వెనుకాడకుండా సిద్ధంగా ఉండాలని, "విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు" అని దిక్కులు పిక్కటిల్లేలా ప్రజలు గర్జించి బిజెపి ప్రభుత్వ మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో వట్టికొండ చంద్రమోహన్, పాటిబండ్ల కోదండరావు,చేకూరి వేంకటాద్రి నాయుడు, గద్దం విఠల్, కట్టా శ్రీనివాసరావు వాసిరెడ్డి మల్లి కార్జునరావులను ఉన్నారు.

మైలవరంలో అక్రమ హౌస్ అరెస్టులు

విశాలాంధ్ర-మైలవరం: విశాఖ ఉక్కును ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి మేరకు రోడ్లు దిగ్బంధనం పిలుపునివ్వగా మైలవరంలో జరగకుండా ముందస్తుగా సీపీఐ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. సీపీఐ మండలం కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, సీపీఎం మండల పార్టీ కార్యదర్శి రావూరి రమేష్ బాబు, చాట్ల, సుధాకర్, హౌస్ అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను పెట్టి ఉద్యమాలు నిర్వహించకుండా అణచివేయడం దారుణమని, ఇలాంటి ప్రభుత్వాలు పతనానికి నాంది అని తెలిపారు.

గంపలగూడెంలో...

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా మండలంలో గంపలగూడెం పోలీసులు ముందస్తుగా బుధవారం రాత్రి నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. హౌస్ అరెస్ట్ చేసిన వారిలో సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్

నాగుల్‌మీరా, ఎం వెంకటరెడ్డి, జె వెంకటేశ్వరరావు, గువ్వల సీతారామిరెడ్డి, చెరకు వీరారెడ్డిలు ఉన్నారు. వామపక్ష నేతల అరెస్ట్ కు నిరసనగా గురువారం ఉదయం తోట మూలలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు యు సాంబశివరావు, గౌర్రాజు రామకృష్ణ, బట్టగాని పూర్ణ చంద్రరావు, బల్లిపోగు ప్రభాకర్, సీపీఎం నేతలు ఎం గోపాలకృష్ణ, ఎం కుటుంబరావు, బి వీరబాబు, జి వీరభద్రం, జనార్ధనా చారి, ఎం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మనోబాల మృతికి ప్రజానాట్యమండలి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ : నటుడు, దర్శకులు మనోబాల(70) బుధ వారం చెన్నైయ్‌లో మృతి చెందారు. మనోబాల మృతికి ప్రజానాట్యమండలి విజయవాడ నగర సమితి ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. హాస్యాన్ని పండించడంలో తనకు తానే సాటి అయిన మనోబాల మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నగర ప్రజానాట్యమండలి ఇన్చార్జి లంక దుర్గారావు, గౌరవాధ్యక్షులు కేవీ భాస్కరరావు, నగర అధ్యక్షులు ఎస్కే నజీర్, కార్యదర్శి డి సూరిబాబు రంగారావు, కాళ్ల చిన్నప్ప, ఎస్ కే భాష తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

నాబార్డ్ నిధులతో చేపట్టిన పనులను తక్షణం పూర్తి చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : నాబార్డ్ ద్వారా జిల్లాకు మంజూరైన గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి(ఆర్ఐడీఎఫ్) నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాబార్డ్ ద్వారా ఆర్ఐడీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల ప్రగతిపై స్థానిక కలెక్టర్ కార్యాయలయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాబార్డ్ ద్వారా 192 ప్రాజెక్టులకు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి (ఆర్ఐడిఎఫ్) రూ.188.39 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనిలో రూ.154.24 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టేందుకు వివిధ శాఖలకు కేటాయించినట్లు చెప్పారు. వీటిలో ఏపీ రిసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్‌లో ఒక ప్రాజెక్టుకు రూ.84 లక్షలు, పశుసంవర్ధక శాఖలో ఎనిమిది ప్రాజెక్టులకు రూ.1 కోటి 12 లక్షల 76 వేలు, ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఐదు ప్రాజెక్టుకు రూ.56 కోట్లు 94 లక్షల 29వేలు, ఇంటర్ ఎడ్యుకేషన్‌లో మూడు ప్రాజెక్టులకు రూ.97 లక్షల 41 వేలు, వ్యవసాయ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు రూ.2 కోట్లు 62 లక్షల 84 వేలు, పంచాయతీరాజ్ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు రూ.3 కోట్ల 55 లక్షల 84వేలు, ఆరోగ్య శాఖలో ఐదు ప్రాజెక్టులకు రూ.11 కోట్ల 13 లక్షల 22 వేలు, రోడ్డు భవనాల శాఖలో మూడు ప్రాజెక్టులకు రూ.4 కోట్ల 02 లక్షల 82 వేలు, గ్రామీణ నీటి సరఫరా శాఖలో రెండు ప్రాజెక్టులకు రూ.7 కోట్ల 82 లక్షల 57 వేలు, సమగ్ర శిక్ష శాఖలో 59 ప్రాజెక్టులకు రూ.56 కోట్ల 36 లక్షల 88 వేలు, గిరిజన సంక్షేమ శాఖలో ఐదు ప్రాజెక్టులకు రూ.4 కోట్ల 89 లక్షల 15 వేలు, మహిళ శిశు సంక్షేమ శాఖలో 93 ప్రాజెక్టులకు రూ.3 కోట్ల 92 లక్షల 46 వేలు కేటాయించడం జరిగిందన్నారు. కేటాయించిన నిధులతో చేపట్టిన ఆయా ప్రాజెక్టులను చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, జెడ్పీ సీఇవో జ్యోతిబసు, ఆం~అండ్ బీ ఎస్ఇ జాన్‌మోషే, డీఇవో సీవీ.రేణుక, ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.నాగమణమ్మ, గిరిజన సంక్షేమాధికారి ఎం.రుక్మాంగదయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఇ ఎ.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగఫలం..విశాఖ ఉక్కు కర్మాగారం

విశాలాంధ్ర-తిరువూరు: 32 మంది అమరవీరుల బలిదానం ఫలితంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. నష్టాలు సాకుగా చూపించి విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ అనాలోచ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏఐటీయుసీ, సీఐటీయూ కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షన్నర మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను దురుద్దేశ పూర్వకంగానే బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేవలం కార్పొరేట్ల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అంబానీ, అదానీలకు దారాదత్తం చేసి, కార్మికుల పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తే కార్మికులంతా సమిష్టిగా పోరాడతామని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేసి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బదీసే ప్రయత్నం చేస్తే వామపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి తగురీతిగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, బడా పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేందుకు మోడీ తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలను తిప్పికొడతామని, లాభాల్లో నడుస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి బొగ్గుగనుల కేటాయించి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కృష్ణయ్య, నాగేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి సుందరరావు, ఉదయ్ మాలపాటి, బాణాల అశోక్, షేక్ సూభాని, అయినాల ముత్తయ్య, పల్లపు మురళి, ఎస్వీ భద్రం, సాంబారు వెంకటేశ్వర్లు, బీ వెంకటేశ్వర రావు, చప్పిడి సురేష్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వీరపనేని తారాదేవికి ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణా జిల్లా వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసిన వీకేఎం తిలక్ సతీమణి వీరపనేని లక్ష్మీకుసుమ తారాదేవి (78) భౌతికకాయానికి బుధవారం ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నివాళులు అర్పించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్న కౌతవరానికి చెందిన వీకేఎం తిలక్‌తో తారాదేవికి 1963లో వివాహం జరిగింది. వివాహం అనంతరం విజయవాడ పటమట పోస్టల్ కాలనీలోని సొంతగృహంలో నివాసం ఉంటున్నారు. దంపతులకు కొడుకు, కూమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం ఒక కిడ్నీ పనిచేయడం లేదు. 22 రోజుల క్రితం మరో కిడ్నీ కూడా పనిచేయకపోవడంతో చికిత్స నిమిత్తం రమేష్‌బాబు హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స అనంతరం గత గురువారం డిచ్చార్జ్ అయి ఇంటికి వచ్చారు. తదనంతరం కామెర్లు రావడంతో మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. బుధవారం ఉదయం తారాదేవి మృతదేహాన్ని సందర్శించి ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నేతలు నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వర రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు దారం వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు జి రఘురాం, టి శివరామ కృష్ణ, వై రంగారావు ఉన్నారు. కృష్ణలంకలోని శ్మశాన వాటికలో తారాదేవికి అంత్యక్రియలు చేశారు.

మే 13, 14 తేదీల్లో జర్నలిస్టుల హెల్త్ క్యాంపు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అహర్నిశలు శ్రమించి విధులు నిర్వహించే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సదుద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సంయుక్త సౌజన్యంతో అక్రిడేటెడ్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మే 13, 14వ తేదీల్లో రెండు రోజుల పాటు హెల్త్ క్యాంపు నిర్వహించి, ఉచితంగా వైద్య సేవలు అందించనున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని లయోలా ఇంజినీరింగ్ కాలేజ్ లో 2 రోజుల పాటు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహణ వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సౌజన్యంతో నిర్వహిస్తు న్నట్లు పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వైద్య సేవల కోసం అక్రిడేటెడ్ జర్నలిస్టులు, కుటుంబ సభ్యుల వివరాలతో నమోదు చేసుకోవాలన్నారు. మే 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉచిత హెల్త్ క్యాంపు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రముఖ ఆస్పత్రులకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందంచే వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో మామోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్టులు, ఈసీజీ, 2డీఎకో, ట్రెడ్ మిల్ టెస్ట్(టిఎంటీ), అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీబీపీ, లివర్ పంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్ట్ లు, ఎక్స్ రే, కళ్లు, డెంటల్ పరీక్షలు వంటి తదితర 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు క్యాంపు ఉంటుందన్నారు. కొత్తగా అక్రిడేటేషన్ పొందే జర్నలిస్టుల కోసం, క్యాంపు లోనే హెల్త్ కార్డులు ఇచ్చేలా డెస్క్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. జర్నలిస్టులు అందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.